పోలింగ్ ఏర్పాట్లు పూర్తి


అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్


గాజువాక హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓటింగ్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. పోలింగ్ సిబ్బంది ఇప్పటికే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. గాజువాకలో 20,188 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 10,964 మంది పురుష ఓటర్లు కాగా, 9,224 మంది మహిళలు. వారికోసం నియోజకవర్గంలోని అధికారులు వివిధ ప్రాంతాల్లో 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలవద్ద పోలీస్ బందోబస్తును పటిష్ఠంగా ఏర్పాటు చేశారు. ఒక కేంద్రం వద్ద ఎస్ఐతోపాటు పది మంది కానిస్టేబుళ్లను నియమించారు. సౌత్ ఏసీపీ సహా సంబంధిత ప్రాంతాలకు చెందిన సీఐలు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు విధులను చేపట్టారు. ఎన్నికల జోనల్ అధికారి పోలింగ్ కేంద్రాలవద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం అన్ని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పోలింగ్ నిర్వహణ సామాగ్రిపై వివరాలను సేకరించారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

సోమవారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లేవారు ఓటరు స్లిప్‌తోపాటు ఎలక్షన్ కమిషన్ జాబితాల్లో పేర్కొన్న ఏదో ఒక గుర్తింపు కార్డును చూపించాలి. ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు లిస్టులో పేర్కొన్న ఇతర కార్డులను కూడా చూపించవచ్చు. ఓటు స్లిప్ లేకపోతే పోలింగ్ కేంద్రాల బయట ఉన్న సహాయక కేంద్రాల్లో తీసుకోవచ్చు. ఓటు సీరియల్ నంబర్ చెబితే సహాయక కేంద్రాల్లో సిబ్బంది స్లిప్పు ఇస్తారు. ఓటు స్లిప్‌కు బదులుగా ఆ స్లిప్ తీసుకొని వెళ్లి ఓటు వేయవచ్చు.

144 సెక్షన్ అమలు

అక్కిరెడ్డిపాలెం: సోమవారం జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పగడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం జరగనున్న పోలింగ్‌లో 5,325 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ జరిగే పాఠశాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఆదివారం పోలింగ్ స్టేషన్ పరిధిలో నిషేధాజ్ఞాలను తెలుపుతూ మార్కులు చేసినట్లు అధికారులు తెలిపారు. కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొత్తం ఓటర్లు	: 20,188
పురుష ఓటర్లు	: 10,964
మహిళా ఓటర్లు	: 9,224

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు


దీక్షా శిబిరంలో పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన విశాఖ ఉక్కుపై కేంద్ర, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తెలుగువారికి అభ్యంతరాన్ని కలిగిస్తున్నాయని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ దీక్షలు ఆదివారం నాటికి 459వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు మొండా తొడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య నేతృత్వంలో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ పోరాట యోధుల ప్రాణ త్యాగాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తే సహించేదిలేదన్నారు. దళితులు, బలహీనన వర్గాలు,పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయని, త్వరలోనే ప్రధానిని కలిసి అభ్యంతరం తెలుపుతామన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, కొత్త సత్యానారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, హెచ్ఎస్ఎల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ అనిల్‌కుమార్, కొండలరావు ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు


విద్యుత్ వెలుగుల్లో స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే బీసీ రోడ్డు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కర్మాగారానికి వెళ్లే ప్రధాన రహదారి బీసీ రోడ్డులో విద్యుత్ దీపాలు కాంతులు విరజిమ్ముతున్నాయి. వారం రోజుల క్రితం వరకూ ఈ రహదారిలోని విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో చీకట్లు అలముకున్నాయి. దీంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు బి షిఫ్టు విధులు ముగించుకుని వచ్చే సమయంలో, సి షిఫ్టునకు వెళ్లే ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఎదురుగా వచ్చే వాహనాలతో పాటు రోడ్డుకు అడ్డంగా వచ్చే పందులు, పశువులను ఢీకొట్టి ప్రమాదాలకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితిపై డీవీఆర్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ స్పందించారు. పెదగంట్యాడ నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే వరకూ బీసీ రోడ్డులో విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ ఎలక్ట్రికల్ డీజీఎంకు లేఖ రాశారు. స్పందించిన జీఎం చంద్రశేఖర్, డీజీఎం వరప్రసాద్, మేనేజర్ ఠాగూర్ స్వయంగా పరిశీలించారు. వెంటనే దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వయంగా పనులను పర్యవేక్షించారు. విద్యుత్ దీపాలను వెలిగించారు. దీంతో ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మంత్రి మూర్తి కుటుంబానికి పరామర్శ

పెదగంట్యాడ: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మంత్రి మూర్తి కుటుంబ సభ్యులను సౌత్ ఏసీపీ త్రినాథ్, స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూర్తి అకాల మరణం కార్మిక లోకానికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రి మూర్తి సోదరులు మంత్రి రాజశేఖర్, మంత్రి శంకరనారాయణ, మూర్తి తల్లి, భార్య, కుమారుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


రైలుపట్టాలపై మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్ఐ

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొన్న సంఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఎస్ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం గాజువాక జోగవానిపాలెంకు చెందిన బోను సూర్యనారాయణ (74) ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రైలు పట్టాలు దాటుకుంటూ ఫార్మాసిటీ కాలనీ వైపు వెళ్తున్నాడు. ఈ సమయంలో అనకాపల్లి నుంచి దువ్వాడ వైపు వస్తున్న గూడ్స్ రైలు అతన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లోకో పైలట్ సమాచారం మేరకు దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుని సమాచారం తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

15 నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వీవ్స్ అండ్ క్రాఫ్ట్ బజార్ పేరుతో చేనేత హస్త కళా ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ సంయుక్త కార్యదర్శి రేణుకా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. దసపల్లా హిల్స్‌లోని గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో బొబ్బిలి చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు, కళాఖండాలు, స్కోల్ అండ్ మార్బుల్ గులక రాళ్లు, చేతితో అత్యంత కళాత్మకంగా తయారు చేసిన అనేక రకాల ఆకృతుల్లో తాటాకు బుట్టలు, బంజార సూది వర్క్ వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ


సాగర తీరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆస్పత్రి సిబ్బంది, నగర యువత పాల్గొన్నారు. గ్లకోమా అనేది కంటిపై ఒత్తిడి పెరుగుదలతో వచ్చిన సమస్య అని, ఇది కోలుకోలేని అంధత్వానికి దారితీస్తుందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ఘనంగా షిర్డీ సాయి శాంతి థామం వార్షికోత్సవం


కలశలను ఊరేగిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు తదితరులు

పెదగంట్యాడ: మండలంలోని సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి థామం 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. కాకడ హారతి, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చక్కెరాభిషేకం భక్తుల స్వహస్తాలతో చేయించారు. అనంతరం మహా కుంభాభిషేకం, మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, 72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్ బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద సాయంత్రం నిర్వహించిన పరసలో సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి ఆలయ ఉత్సవాలను ప్రారంభించామని చెప్పారు. ప్రతి రోజూ బాబాకు విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించామన్నారు. అలాగే రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామని తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


పెదగంట్యాడ జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడ రాజు

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలోని వికాస్‌నగర్, పెదగంట్యాడ జంక్షన్లలో ఆదివారం సాయంత్రం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడ రాజు ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

16న మహా నారాయణ సేవ



అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం మహా నారాయణసేవ నిర్వహించనున్నట్లు కళా హాస్పటల్ అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడి రమణమూర్తి తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 27, 28 తేదీల్లో అమ్మవారి వార్షిక జాతర ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. దీంట్లో భాగంగా అమ్మవారి మహా నారాయణసేవ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కమిటీ సభ్యుడు, ఉపాధ్యక్షుడు కొణతాల గణేష్, బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ, తమరపు మధు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీ విజేత గాజువాక


విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న చెల్లుబోయిన నాయుడు తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఎస్పీఎన్ఎస్ఈ యూత్ సభ్యుడు పూడి సన్నీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో గాజువాక జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆలయ ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 25 జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. ఫైనల్ పోటీలు గాజువాక జట్టు, విశాఖ జట్లు హోరాహోరీగా తలపడగా గాజువాక జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో విశాఖ, తృతీయ, నాలుగో స్థానంలో నడుపూరుకు చెందిన రెండు జట్లు సాధించాయి. బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథులుగా గ్రామ నాయకులు చెల్లుబోయిన నాయుడు, ములగపాక అచ్చింనాయుడు, తాటికొండ కాశీ విజేతలకు ఈ పోటీల్లో ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.6 వేలు, నాలుగో బహుమతి కింద రూ.4వేలతో పాటు షీల్డ్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిన నాగభూషణం, జెర్రిపోతుల ముత్యాలు, తాటికొండ సుదర్శన్, బత్తిన భానుకిరణ్, పీత ప్రసాద్, పీత కృష్ణ, పితాని భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

కీటకాహార మొక్కలు


కీటకాలను ఆకర్షించే తిత్తె వంటి నిర్మాణం


కీటకాలను ఆహారంగా తీసుకునే మొక్క

ఏయూ క్యాంపస్: కీటకాహార మొక్క పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో కనువిందు చేస్తోంది. ఒక మొక్క పదికిపైగా ప్రత్యేకమైన సంచులతో వృక్షశాస్త్ర పరిశోధకులు, విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ట్రయాంగులరిస్‌గా వ్యవహరించే ఈ చెట్టు ఆకు మధ్య ఈనె ఒక తిత్తిగా మారిపోతుంది. తిత్తె చుట్టూ మకరందం వంటిది ఏర్పడుతుంది. ఇది కీటకాలను ఆకర్షిస్తుంది. అందమైన రంగులతో కనిపించే ఈ తిత్తెను చూసి కీటకాలు దీనికి ఆకర్షితమవుతాయి. దీనిని తాకిన వెంటనే కీటకాలు ఆ తిత్తెవంటి సంచిలోకి జారిపోతాయి. వీటిని ఆహారంగా మార్చుకుని జీర్ణచేసుకునే లక్షణం కలిగి ఉండటం దీని ప్రత్యేకత. కీటకాలను ఆరగించి, జీర్ణం చేసుకుంటుంది. ఈ మొక్కలను ప్రత్యేక పరిస్థితుల్లో పెంచుతారు. వీటికి నేరుగా ఎండ తలగకూడదు. నీడనిచ్చే ప్రాంతాలలో కుండీలలో వీటిని పెంచుతారు. దీనికి ప్రత్యేకంగా ఆర్‌ఓ వాటర్, సహజ సిద్ధమైన వర్షపు నీటిని మాత్రమే వినియోగించాలి. మేఘాలయలో దట్టమైన అటవీ ప్రాంతాలలో ఇవి కనిపిస్తాయని జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. నెపెంథిస్ జాతికి చెందిన మొక్కలుగా వీటిని వ్యవహరిస్తారు.

రాష్ట్రాభివృద్ధే వైఎస్సార్ సీపీ ధ్యేయం

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం


టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు


74వ వార్డులో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

పెదగంట్యాడ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడి అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని స్థాపించారని చెప్పారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలపై ఉద్యమాలు చేయడంతో పాటు పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నెరవేర్చి ఉత్తమ ముఖ్యమంత్రిగా ఖ్యాతినార్జించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, రాజాన వెంకటరావు, కోమటి శ్రీనివాసరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, ఎన్నేటి రమణ, రామానాయుడు, నక్క వెంకట రమణ, వెంపాడ అప్పారావు, కొయ్య భారతి, ఈగలపాటి యువశ్రీ, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, అండిబోయిన అప్పారావు, మహాలక్ష్మీ నాయుడు, ములకలపల్లి వెంకటేష్, సంపంగి ఈశ్వరరావు, మాటూరు శ్రీనివాసరావు, సాపె బ్రహ్మయ్య, మెడికల్ బాబు, రంభ నారాయణమూర్తి, మద్దాల అప్పారావు, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

74వ వార్డులో..

జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో నిర్వహించిన వేడుకల్లో వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజారావు, ఎన్వై నాయుడు, బి.గోవింద్, గొందేశి సత్యారావు, లోకేష్, ఎస్.రమణ, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

75వ వార్డులో..

వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, బసా సాధురెడ్డి, మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, వెంకటేష్, అండిబోయిన అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

గాజువాక: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని 70వ వార్డులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టినాయుడు కాలనీలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు ఆవిష్కరించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పాలన విజయవంతంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, నాయకులు నీలాతి అచ్చిబాబు, నాయుడు, రంగాల పైడిరాజు, భాస్కరరావు, ఈశ్వరరావు, పైడిరాజు, రవికుమార్, గోపి, రాజ్యవరలక్ష్మి, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అరకు అందాలు మైమరిపిస్తాయి..

- ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి
- నేషనల్ గ్రూప్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌లో చిత్రాలను తిలకిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

బీచ్ రోడ్డు: అరకు అందాలను నేరుగా చూసినా, చిత్రాల్లో చూసినా మనస్సును మైమరిపిస్తాయిని తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఏర్పాటు చేసిన నేషనల్ గ్రూప్ షో ద్వారా తెలిసిందని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో నేషనల్ గ్రూప్ షో పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న ఎగ్జిబిషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను చిత్రాల ద్వారా బంధించి రాబోయే తరాలకు అందించాలన్నారు. చిత్రలేఖనం అంత సులభం కాదన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు గీసిన చిత్రాలు మనస్సును హత్తుకుంటున్నాయన్నారు. నగరవాసులు ఈ ప్రదర్శనను సందర్శించి గిరిజన జీవన శైలిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ డి.సింహాచలం, ఎస్.శ్రీనివాస్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి
- రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైల్వే ఉద్యోగులు, అధికారుల కోసం వాల్తేర్ డివిజన్ ఆదివారం దొండపర్తిలోని రైల్వే హాస్పిటల్‌లో న్యూరో, కార్డియాలజీ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి పర్యవేక్షణలో రైల్వే ఆస్పత్రి వైద్యుల బృందం సేవలందించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. వ్యక్తిగత ఆరోగ్యం, పోషణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి రైల్వే ఉద్యోగి, సిబ్బంది బాధ్యతని పేర్కొన్నారు. నిర్దేశిత సమయాల్లో ఇటువంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అధికారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వారికి నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఈ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్ఎం చెప్పారు. మెడికల్ క్యాంప్‌లో సుమారు 57 మంది అధికారులు, 3 కుటుంబాల సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా.. వీరిలో కొత్తగా నలుగురు హైపర్ టెన్షన్‌తో, ఇద్దరు డయాబెటిస్ మెల్లిటస్‌తో, ఇద్దరు ఇష్కెమిక్ హార్ట్ డిసీజ్‌తో బాధపడుతున్నట్లు కనుగొన్నారు. వీరిలో అవసరమైన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

పౌర గ్రంథాలయంలో సంగీత విభావరి రేపు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎస్‌కే మహంతి, అనూష పట్నాయక్

బీచ్ రోడ్డు: సినీ సంగీత దర్శకుడు కేవీ మహదేవన్ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మా, సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు హైకోర్టు న్యాయవాది, ఆయా సంస్థల అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి తెలిపారు. ఆదివారం రామ్‌నగర్‌లో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూషా పట్నాయక్‌తో కలిసి ఆయన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మహంతి మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా కళా రంగానికి తనగాన మాధుర్యంతో అలరిస్తున్న జామి శివ అప్పలరాజుకు స్వర కళా పురస్కారం అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. 14న సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కేవీ మహదేవన్ స్వరపరచిన చిత్ర గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాకారుల గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఘంటసాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.